వీరమల్లు ఆగమనానికి రంగం సిద్ధం

ఈ ఏడాది విడుదల కానున్న భారీ పాన్ ఇండియా సినిమాల్లో 'హరిహర వీరమల్లు' ఒకటి. అగ్ర హీరో పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. జూన్ 12న సినిమా విడుదలకానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని మేకర్స్ చెబుతున్నారు. త్వరలోనే ఈ సినిమాలోని మూడో గీతం కూడా విడుదల కానున్నదని, అలాగే.. ట్రైలర్‌ని కూడా విడుదల చేస్తామని, సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చేలా ట్రైలర్ ఉండబోతున్నదని వారు తెలిపారు. వెండితెరపై మునుపెన్నడూ చూడని అద్భుతాన్ని ప్రేక్షకులకు అందించాలనే దృక్పథంతో దర్శకుడు ఎ.ఎం.జ్యోతికృష్ణ అవిశ్రాంతంగా ఈ సినిమాకోసం శ్రమిస్తున్నారని చిత్ర నిర్మాత ఎ.దయాకర్‌రావు తెలిపారు. పవన్‌కల్యాణ్ కెరీర్‌లో తొలిసారి జానపద వీరుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుగా బాబీ డియోల్ కనిపించనున్నారు. నిధి అగర్వాల్ ఇందులో కథానాయిక. అనుపమ్‌ఖేర్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వి.ఎస్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, సమర్పణ: ఎ.ఎం.రత్నం, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

బ్రహ్మగిరి గుహలో అన్వేషణ

నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా 'ఎన్‌సీ24' (వర్కింగ్ టైటిల్) చిత్రీకరణ ఇటీవల మొదలైన విషయం తెలిసిందే. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో భారతీయ మూలాలు, చరిత్ర, మార్మిక అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది. అన్నపూర్ణ స్టూడియోలో వేసిన బ్రహ్మగిరి గుహ సెట్‌లో కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో నాయకానాయికలు నాగచైతన్య, మీనాక్షి చౌదరి పాల్గొంటున్నారు. కథానుగుణంగా గోదావరి జన్మస్థానంగా ఈ బ్రహ్మగిరి గుహలను చూపిస్తున్నామని, ఇక్కడ చిత్రీకరించే సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో ట్రెజర్ హంటర్ అర్జున్ పాత్రలో నాగచైతన్య, రక్ష అనే అమ్మాయి పాత్రలో మీనాక్షి చౌదరి కనిపించనున్నారు. భారీ వ్యయంతో రూపొందించిన ఈ సెట్ నిర్మాణానికి 50 రోజులు పట్టిందని, కళా దర్శకుడు శ్రీనాగేంద్ర ప్రేక్షకులను అబ్బురపరిచేలా సెట్‌ను తీర్చిదిద్దారని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నీల్ డి కున్హా, సంగీతం: అజనీష్ బి లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, దర్శకత్వం: కార్తీక్ దండు.

హిట్ కాంబినేషన్ రిపీట్?

అగ్ర హీరో చిరంజీవి కథానాయకుడిగా దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ) తెరకెక్కించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. తాజా సమాచారం మేరకు మళ్లీ ఈ కాంబినేషన్ రిపీట్ అవ్వబోతున్నదని తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన కథ కూడా లాక్ అయ్యిందట. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' షూటింగ్‌ని పూర్తి చేసేపనిలో ఉన్నారు. ఆ తర్వాత అనిల్ రావిపూడి సెట్‌లోకి మెగాస్టార్ ఎంటరవుతారు. ఈ రెండు సినిమాల తర్వాత బాబీ సినిమా మొదలవుతుందని తెలుస్తున్నది. కన్నడ స్టార్ హీరో యష్ హీరోగా 'టాక్సిక్' చిత్రాన్ని నిర్మిస్తున్న ప్రఖ్యాత కన్నడ నిర్మాణ సంస్థ కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనున్నది.

కన్నప్ప కామిక్ సిరీస్ విడుదల

మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'. శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా ముఖేష్‌కుమార్‌సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత ఎం.మోహన్‌బాబు. భారీ అంచనాలు నెలకొన్న ఈ పాన్ ఇండియా సినిమా జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మోహన్‌బాబుతోపాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి స్టార్ హీరోలు ఈ సినిమాలో భాగం కావడం విశేషం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల వల్ల సినిమాపై మంచి బజ్ ఏర్పడిందని మేకర్స్ చెబుతున్నారు. కన్నప్ప కథకు అందరికీ చేరువ చేయాలనే తలంపుతో మంచు విష్ణు ఈ కథను కామిక్ సిరీస్‌గా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌కి సంబంధించిన మొదటి రెండు ఎపిసోడ్‌లకూ మంచి స్పందన లభించిందని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మూడో ఎపిసోడ్‌ని విడుదల చేశారు. తిన్నడులోని భావోద్వేగ, ఆధ్యాత్మిక పరివర్తనను ఈ చివరి ఎపిసోడ్ సూచిస్తుందని, నాస్తికుడైన తిన్నడు, ఆస్తికుడైన కన్నప్పగా ఎలా మారాడో ఈ ఎపిసోడ్ తెలియజేస్తుందని, ప్రేమ, భక్తి, త్యాగంతో నిండిన ఈ కథ అందర్నీ ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఏఐ ద్వారా క్రియేట్ చేసిన ఈ విజువల్స్ అందర్నీ అబ్బురపరుస్తాయని మేకర్స్ పేర్కొన్నారు.

స్కూల్ రోజులు గుర్తుకొచ్చాయి!

'నిర్మాతలు వరుసగా ఎందుకు సినిమాలు చేస్తారో ఇప్పుడర్థమైంది. ప్రేక్షకుల్ని నవ్వించాలన్నదే వారి లక్ష్యం. ఈ సినిమా షూటింగ్ టైంలో నాకు స్కూల్ రోజుల్లోని వేసవి సెలవులు గుర్తుకొచ్చాయి. మాకు ఎలాగైనా సినిమా చూపించాలని అమ్మ తపన పడేది. థియేటర్‌లో సినిమా చూస్తూ అన్నయ్యతో గొడవపడటం, సినిమా గురించి అదే పనిగా చర్చించుకోవడం...ఇలాంటి జ్ఞాపకాలను ప్రేక్షకులకు అందించాలనే సంకల్పంతోనే నిర్మాణ సంస్థను స్థాపించాను' అని చెప్పింది అగ్ర కథానాయిక సమంత. ఆమె నిర్మాతగా మారి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన 'శుభం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ హారర్ కామెడీ మూవీకి ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. శుక్రవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ పై విధంగా స్పందించింది. నిర్మాతగా మారిన తర్వాత సినిమాను చూసే దృష్టికోణం మారిందని, నటిగా ఉన్నప్పుడు సినిమా రివ్యూల్లో తనకు సంబంధించిన విషయాలను ముందుగా చదివేదాన్నని, ఇప్పుడు అందరి గురించి ఆలోచిస్తున్నానని సమంత తెలిపింది. ఈ సినిమా నిర్మాణం విషయంలో మైత్రీ మూవీ మేకర్స్ ఎంతో సపోర్ట్ చేసిందని, టీమ్ అందరి కృషి వల్లే ఇంతటి విజయం సాధ్యమైందని సమంత ఆనందం వ్యక్తం చేసింది.

హే తారక్.. ఆ రోజున ఏం జరగబోతుందో తెలుసా?..

దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో 'వార్ 2' ఒకటి. యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ అడ్వెంచరస్ థ్రిల్లర్‌లో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఈ నెల 20న తారక్ పుట్టిన రోజు సందర్భంగా 'వార్2'కు సంబంధించిన అప్‌డేట్‌ని హీరో హృతిక్ రోషన్ తన ఎక్స్(ట్విటర్) ద్వారా అందించారు. 'హే తారక్.. ఈ ఏడాది మే 20న ఏ అప్‌డేట్ రాబోతుందో? అసలు ఏం జరగబోతుందో నీకు తెలుసా?.. నువ్వు అస్సలు ఊహించలేవ్.. మీరంతా సిద్ధంగా ఉండండి..' అంటూ హృతిక్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. ఎన్టీఆర్ పుట్టినరోజైన ఈనెల 20న ఈ సినిమా గ్లింప్సో, లేక ట్రైలరో ఏదో ఒకటి విడుదల చేయనున్నట్టు హృతిక్ చెప్పకనే చెప్పారు. దాంతో మే 20 కోసం తారక్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శ్రీవిష్ణుకి మరో రెండు ఆఫర్లిచ్చాను!

'ఈ సినిమా రషెస్ చూసిన తర్వాత శ్రీవిష్ణుని పిలిచి గీతా ఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని చెక్ ఇచ్చాను. నటుడిగా, వ్యక్తిగతంగా అంత బాగా నచ్చాడు. సినిమా బాగుంటే థియేటర్‌కు వస్తామని నిరూపించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పణలో శ్రీవిష్ణు, వెన్నెల కిషోర్, కేతికశర్మ, ఇవానా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింగిల్'. కార్తీక్‌రాజు దర్శకుడు. విద్యా కొప్పినీడి, భానుప్రతాప, రియాజ్ చౌదరి నిర్మాతలు. శుక్రవారం ఈ సినిమా సక్సెస్‌మీట్ నిర్వహించారు. మండు వేసవిలో నవ్వుల జల్లులా ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని అల్లు అరవింద్ ఆనందం వెలిబుచ్చారు. ఈ కథను 15 మంది రిజెక్ట్ చేశారని, వారందరికీ థాంక్యూ (నవ్వుతూ) చెబుతున్నానని, నిజాయితీగా పనిచేస్తే విజయం తథ్యమనే విషయాన్ని ఈ సినిమా నిరూపించిందని శ్రీవిష్ణు అన్నారు. ఈ సినిమా కోసం శ్రీవిష్ణుతో చేసిన జర్నీని మరచిపోలేనని, ఆయనతో మరిన్ని సినిమాల్లో పనిచేయాలనుందని వెన్నెల కిషోర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, కిషోర్ తిరుమల, వివేక్ ఆత్రేయ తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

తెలంగాణ థియేటర్లపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలోని ఎగ్జిబిటర్లు, సినిమా థియేటర్లు కేవలం షేర్ ఆధారిత వ్యవస్థపైనే నడపాలని నిర్ణయించారని, అలాగే కొంత పర్సంటేజ్ పద్ధతుల్లో థియేటర్ల నిర్వహణపై నిర్ణయం తీసుకున్నారని కొన్ని మీడియా సంస్థల్లో, సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేసింది. ఈ నెల 18న తెలంగాణ, ఆంధ్రా ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశం జరగనుందని, ఇందులో పలు సమస్యలపై చర్చిస్తామని, అలాగే రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కూడా చర్చ జరుగుతుందని టీఎస్ఎఫ్‌సీసీ అధ్యక్షుడు సునీల్ నారంగ్, సెక్రటరీ కె.అనుపమ్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మండోదరి పాత్రలో?

వాల్మీకి రామాయణంలో సీత పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉందో.. రావణాసురుడి అర్ధాంగి మండోదరి పాత్రకు కూడా అంతటి ప్రాధాన్యత ఉంది. సీతకు ఏమాత్రం తీసిపోని మహాపతివ్రత మండోదరి. జమున, బి.సరోజాదేవి, కృష్ణకుమారి వంటి మేటి నటీమణులు ప్రాణప్రతిష్ట చేసిన పాత్ర అది. అలాంటి గొప్ప పాత్ర కాజల్ అగర్వాల్‌ని వరించిందనేది ఇప్పుడు బాలీవుడ్ మీడియాలో లేటెస్ట్ న్యూస్. రణ్‌బీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా పౌరాణిక చిత్రం 'రామాయణ'లో యష్ రావణుడిగా నటిస్తుండగా, మండోదరిగా కాజల్ అగర్వాల్ ఖరారయ్యారట. ఇప్పటికే టీమ్ ఆమెను సంప్రదించిందనీ, కాజల్ కూడా మండోదరిగా కనిపించేందుకు సుముఖత వ్యక్తం చేశారనేది బాలీవుడ్ సమాచారం. గతవారం లుక్ టెస్ట్ కూడా జరిగిందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ ప్రచురించింది. ఇదే నిజమైతే.. కాజల్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే పాత్ర ఇదే అవుతుంది. రెండు భాగాలుగా ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 2026 దీపావళికి తొలి భాగాన్ని, 2027 దీపావళికి మలి భాగాన్నీ విడుదల చేస్తామని నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రా ఇటీవలే ప్రకటించారు.

డివోషనల్ థ్రిల్లర్ మహేంద్రగిరి వారాహి

సుమంత్ కథానాయకుడిగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. రాజశ్యామల పతాకంపై మధు కాలిపు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానుంది. తాజాగా సుమంత్ ఈ సినిమాలోని తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం స్టార్ట్ చేశారు. ఆయన కెరీర్‌లో ఈ సినిమా మైలురాయిలా నిలిచిపోతుందని, అన్ని వర్గాలనూ అలరించేలా సినిమా ఉంటుందని దర్శకుడు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని ఆయన తెలిపారు. మీనాక్షి గోసామి, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల, కమల్ కామరాజు, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

కాలం నేర్పే ప్రేమపాఠం

స్వీయ దర్శకత్వంలో దేవన్ హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ 'కృష్ణలీల'. 'తిరిగొచ్చిన కాలం' ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణ కథానాయిక. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించారు. 'ప్రేమించడం, ప్రేమించబడటం..రెండూ కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అవాయిడ్ చేయాలనుకున్నా. అది మరింత కాంప్లికెటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదు' అనే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సూపర్ నేచురల్ అంశాలు కలబోసిన ప్రేమకథా చిత్రమిదని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని చిత్రబృందం పేర్కొంది. వినోద్‌కుమార్, పృథ్వీ, రవి కాలే, తులసి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: జ్యోత్స్న జి, దర్శకత్వం: దేవన్.

కాలేజీ రోజుల జ్ఞాపకాల్లో..

'జైలర్' 'నాసామి రంగ' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మలయాళీ భామ మిర్నా మీనన్. ఆమె నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'డాన్ బాస్కో'. రుష్య హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి పి.శంకర్ గౌరి దర్శకుడు. శైలేష్ రమ నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాలో మిర్నామీనన్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. 'పాఠశాల మిత్రుల రీయూనియన్ నేపథ్యంలో సాగే కథ ఇది. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని మేకర్స్ తెలిపారు. మౌనిక, మురళీశర్మ, విష్ణు ఓయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎదురోలు రాజు, సంగీతం: మార్క్ కె రాబిన్, దర్శకత్వం: పి.శంకర్ గౌరి.